
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
సోమవారం 24 నవంబరు 2025



ఎక్సైజ్ శాఖనా మజాకా..!

- వైసీపీ సానుభూతిపరులకు ఒక రూలు
- కూటమికి మరో రూల్
- బ్రాందీషాపు మార్చమని మొత్తుకుంటున్నా కనికరించని వైనం
- ఇంకా వైసీపీ నేతలదే డామినేషన్





అప్సర సర్కిల్‌కు మార్చనున్న కనకధారా వైన్స్, వినాయక్‌నగర్ నుంచి షిఫ్ట్ అయిన రెడ్డి వైన్స్



గత పాలనలో జే బ్రాండ్ ఏరులై పారింది. వారు ఆడిందే ఆట.. పాడిందే పాటగా సాగింది. అధికారులూ వీరికి వత్తాసు పలకడంతో అందినకాడికి దోచుకున్నారు. ఆ ప్రభుత్వంలో కల్తీ మద్యం తాగి ఎందరో మృతి చెందారనే ఆరోపణలు అప్పట్లో బలంగా వినిపించాయి. కాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. మద్యం షాపులను ప్రైవేటుకు అప్పగించారు. ఫీజులు భారీగా చెల్లించి వ్యాపారులు షాపులను నడుపుతున్నారు. అయితే అనుకున్న మేర కొన్ని షాపులు జరగకపోవడం.. మెయింటనెన్స్ ఎక్కువ కావడంతో రద్దీ ప్రాంతాల్లోకి షిఫ్ట్ చేయాలనుకున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. కానీ వైసీపీ నేతల షాపులను మాత్రం కోరుకున్న చోటకు మారుస్తుండడంతో వైసీపీ నేతలకు ఒక రూల్.. కూటమి నేతలకు మరో రూలా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ ప్రభుత్వంలోనూ వైసీపీ నేతలదే డామినేషన్ వుండడంతో ముక్కున వేలేసుకుంటున్నారు.



(కడప-ఆంధ్రజ్యోతి): కడప ఎక్సైజ్ పరిధిలో 30 బ్రాందీషాపులు 9 బార్లు ఉన్నాయి. స్టేషన్ పరిధిలో కడపతో పాటు శివారు ప్రాంతాలైన సీకేదిన్నె, చెన్నూరు, వల్లూరు ప్రాంతాలు వస్తాయి. మద్యం బిజినెస్ కడపతో పాటు శివారు ప్రాంతాల్లో ఎక్కువగా ఉంటుంది. అలా అని షాపులను ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం దక్కించుకున్నారు. షాపులు తీసుకున్న తరువాత వచ్చే ఆదాయానికి, పెట్టుబడి ఖర్చులకు తేడా ఉందని నష్టం వస్తుందంటూ బ్రాందీషాపుల యజమానులు మొత్తుకుంటున్నారు. మెయింటెనెన్స్ ఎక్కువగా ఉండడంతో లబోదిబోమంటున్నారు. ఈ నేపథ్యంలో బ్రాందీషాపులను అదే పరిధిలో ఉన్న చోట నుంచి మరో చోటకు మార్చుకునే అవకాశం ఉండడంతో వ్యాపారం జరిగే చోటకు మార్చుకునేందుకు బ్రాందీషాపుల యజమానులు ప్రయత్నిస్తున్నారు. ఇందులో కొన్ని షాపులు షిఫ్ట్ కాగా, మరికొన్ని షిఫ్ట్ కావడం లేదు. ముఖ్యంగా వైసీపీ నేత, జగన్‌కు స్వయానా బంధువు అయిన వైన్‌షాపును కూడా మార్చివేశారు. కూటమికి చెందిన ఓ షాపును మాత్రం మేం మార్చమంటే మార్చమంటూ ఎక్సైజ్ అధికారులు పట్టుబట్టడం ఇప్పుడు జిల్లాలో పెద్ద చర్చనీయాంశంగా మారింది.

కడప ఎక్సైజ్ పరిధిలో 30 బ్రాందీషాపులున్నాయి. వాటిలో నగర శివారులోని కొన్ని షాపులలో సిటీ మెయిన్‌లోకి వచ్చేశాయి. ఇందులో వైసీపీకి చెందిన బ్రాందీషాపులు ఉండడం గమనార్హం. వినాయకనగర్ సర్కిల్‌లో ఉన్న సోములరెడ్డి వైన్స్‌ను ఐటీఐ సర్కిల్‌కు మార్చారు. అలాగే ఇందిరానగర్ పరిధిలో ఉన్న రెడ్డి వైన్స్‌ను కీలకమైన రాజీవ్‌మార్గ్ రోడ్డులో ఏర్పాటుకు అనుమతినిచ్చారు. ఎర్రముక్కపల్లె సర్కిల్ నుంచి రాజీవ్‌మార్గ్ పోయే రోడ్డు ప్రస్తుతం చాలా కీలకమైన రోడ్డు. ఉదయం, సాయంత్రం వేళల్లో పెద్దసంఖ్యలో వాకర్స్ తిరుగుతుంటారు. ఈ షాపు పక్కనే రెడ్డి కమిటీకి చెందిన హాస్టల్స్, ఎదురుగా బ్యాంకు ఉన్నాయి. ఈ రోడ్డుపై రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో మరీ తక్కువ అనుకుంటే 500 మంది తిరుగుతుంటారు. కడప నగరానికి రాజీవ్‌మార్గ్ వాకర్స్‌కు హార్ట్‌లాంటిది. అయితే ఇక్కడ బ్రాందీషాపు పెట్టారు.



అగ్రిమెంటులో జగన్ మేనమామ రవీంద్రనాథరెడ్డి చేసిన సంతకం

స్థానికులు వద్దు వద్దని మొత్తుకున్నా డోంట్ కేర్ అంటూ ఎక్సైజ్ శాఖ పట్టించుకోలేదు. రాజంపేట రోడ్డులో కనకధారా వైన్స్ షాపు ఉంది. అది కూటమిలో ఓ పార్టీకి చెందిన నేతలది. ఇక్కడ బిజినెస్ జరగడం లేదు, తాము అప్సరసర్కిల్‌లో ఓ ప్రాంతానికి వెళతామని మొత్తుకున్నా ఎక్సైజ్ అధికారులు స్పందించలేదు. పాపం ఈ విషయాన్ని యజమానులు డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లారు. అయినా కడప ఎక్సైజ్ అధికారులు మేమింతే అంటూ పట్టించుకోకపోవడం గమనార్హం. జనం వద్దు వద్దు అన్నా షాపును మార్చడం, అలాగే వైసీపీ మద్దతుదారుడి బ్రాందీషాపును వినాయక్‌నగర్ నుంచి మార్చిన ఎక్సైజ్ అధికారులు కూటమి నాయకుల బ్రాందీషాపును మార్చేందుకు అనుమతి ఇవ్వకపోవడం గమనార్హం. ఈ విషయాన్ని ఆంధ్రజ్యోతి ఎక్సైజ్ డిప్యూటీ కమిషనరు జయరాజ్‌ను వివరణ కోరగా కనకధారా వైన్స్ షిఫ్టింగ్ ఫైలును కమిషనరేట్‌కు పంపించామన్నారు.

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

కడప కలెక్టరేట్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సభాభవనంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9-30 గంటల నుంచి డయల్ యువర్ కలెక్టర్, 10 గంటల నుంచి ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం వుంటుందని, అర్జీదారులు సమస్యలు పరిష్కారం పొందాలన్నారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి 1100 కాల్‌సెంటర్ ఏర్పాటు చేసిందని, అర్జీదారులు ఫోన్ చేసి తమ అర్జీలు పరిష్కారమయ్యాయా? ఏ దశలో ఉన్నాయనే విషయాలను తెలుసుకోవచ్చని డీఆర్వో ఆ ప్రకటనలో సూచించారు.

సేవా మార్గాన్ని అనుసరించాలి

- సత్యసాయిబాబా శతజయంతి వేడుకల్లో కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



సత్యసాయిబాబా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్, జేసీ

కడప కలెక్టరేట్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అందరినీ ప్రేమించాలి.. అందరికీ సేవ చేయాలనే మార్గాన్ని అనుసరించేలా సత్యసాయిబాబా ప్రేరణ ఇచ్చారని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో సత్యసాయిబాబా శత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు తదితరులు పాల్గొన్నారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మానవాళికి సేవ చేయడమే భగవంతునికి సేవ అనే నమ్మకాన్ని సత్యసాయిబాబా ప్రచారం చేశారన్నారు. 1950లో ఆశ్రమం స్థాపించినపుడు అనంతపురం జిల్లా వెనుకబడిన కరువు జిల్లాగా ఉండేదని, అక్కడ ఆశ్రమం స్థాపించిన తరువాత విద్య, వైద్యం, తాగునీరు ఆశ్రమం ద్వారా అందుతోందన్నారు. ట్రస్టు ద్వారా ఎలాంటి లాభాపేక్ష లేకుండా ప్రజల అవసరాలకు అనుగుణంగా అందించే వలంటరీ వ్యవస్థను అందించేవారన్నారు. జేసీ అదితిసింగ్ మాట్లాడుతూ సత్యసాయి బాబా అనుసరించిన సేవా, ప్రేమ మార్గాన్ని అనుసరించాలని, ఆయన ట్రస్టు ద్వారా అందించే సేవలు ప్రపంచంలోని మానవాళికి ఆదర్శనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్డీసీ వెంకటపతి, డీఆర్డీఏ పీడీ రాజ్యలక్ష్మీ, జిల్లా పర్యాటక శాఖాధికారి సురేష్, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

'మానవ సేవే.. మాధవ సేవ'ను స్ఫూర్తిగా తీసుకోవాలి

- ఏఆర్ అదనపు ఎస్పీ రమణయ్య



సత్యసాయిబాబా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏఆర్ ఏఎస్పీ

కడప క్రైం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మానవ సేవే.. మాధవ సేవ నినాదాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని సత్యసాయిబాబా సూచించారని, ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని ఏఆర్ అదనపు ఎస్పీ రమణయ్య పేర్కొన్నారు. ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల సందర్భంగా జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఏఆర్ అదనపు ఎస్పీ బి.రమణయ్య సత్యసాయి బాబా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచ స్థాయి విద్యను ఒక రూపాయి ఖర్చు లేకుండా అందించిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఐలు వెంకటేశ్వర్లు, రామస్వామిరాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రీల్స్ చేసేందుకు వెళ్లి.. మృత్యుఒడిలోకి

- వాటర్‌గండి వద్ద ఇద్దరు విద్యార్థులు గల్లంతు



రోహిత్‌బాబు, నరేశ్

చెన్నూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సరదాగా రీల్స్ చేసేందుకు వెళ్లి.. ఇద్దరు విద్యార్థులు గల్లంతైన విషాదకర సంఘటన మండలంలోని వాటర్‌గండిలో చోటుచేసుకుంది. సీఐ క్రిష్టారెడ్డి వివరాల మేరకు..

కడప నగరంలోని మరియాపురం సెయింట్ జోసెఫ్ కళాశాలలో ఇంటర్ చదివే ఐదు మంది విద్యార్థులు ఆదివారం కావడంతో సరదాగా షికారు కోసం వాటర్‌గండికి చేరుకున్నారు. స్నేహితులతో కలిసి ఎంజాయ్ చేశారు. అక్కడే రీల్స్ చేసుకుంటూ గడిపారు. అయితే ఇటీవల కురుస్తున్న వర్షాలతో నదిలో కాస్త నీటి ప్రవాహం ఎక్కువగా ఉంది. పైగా అక్కడ నీటిలో దిగితే సుడిగుండాలు ఉంటాయని నీటిప్రవాహం ఉధృతంగా ఉందని తెలియని ఆ విద్యార్థులు నదిలో దిగారు. వీరిలో ఇద్దరు నీటి ఒరవడికి భయపడి ఒడ్డుకు చేరుకోగా, జ్యేష్టాది అరుణ్, నరేశ్, రోహిత్ బాబు నీటిలోనే వుండిపోయారు. కొద్దిసేపటికే వీరు ముగ్గురు కొట్టుకుపోతుండగా ఒడ్డున వున్న స్నేహితులు గట్టిగా కేకలు వేశారు. హుటాహుటిన అదే ప్రాంతంలో శివాలయంలో వాచ్‌మెన్‌గా పనిచేసే ఆంజనేయులు ట్యూబు సాయంతో నదిలో దిగి అరుణ్‌ను కాపాడాడు. ఇంతలోనే కడప నగరం రామాంజనేయపురానికి చెందిన నరేశ్ (16), అశోక్‌నగర్‌కు చెందిన రోహిత్ బాబు (16) గల్లంతయ్యారు. ఎంత వెతికినా కనిపించకపోవంతో స్నేహితులు బోరున విలపించారు. జరిగిన విషయాన్ని నరేష్ తండ్రి నాగేశ్వర్‌రావు, రోహిత్‌బాబు తండ్రి వెంకటసుబ్బయ్యలకు తెలిపారు. సమాచారం అందుకున్న కడప చిన్నచౌకు సీఐతో పాటు చెన్నూరు పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లారు. వాతావరణం అనుకూలించకపోవడం, చీకటి పడడంతో గల్లంతైన వారి కోసం వెతుకులాటకు ఇబ్బందులు ఎదురై తిరిగి వచ్చారు. కాగా గల్లంతైన విద్యార్థుల తల్లిదండ్రులు, బంధువులు చేరుకొని కన్నీటి పర్యంతమయ్యారు.


నేటి నుంచి 'రైతన్నా.. మీకోసం'

- కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప కలెక్టరేట్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమంలో భాగంగా ఈ నెల 24 నుంచి రైతన్నా..మీకోసం కార్యక్రమాన్ని అమలు చేస్తోందని కార్యచరణతో ముందుకు వెళ్లాలని అధికారులను కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. ఆదివారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో పెనుమార్పుల ద్వారా సాగును లాభసాటి చేసేందుకు ప్రభుత్వం పలు కార్యక్రమాలను చేపడుతోందన్నారు. ఇందులో భాగంగా పంచసూత్రాల ద్వారా రైతులకు మేలు చేసే కార్యక్రమాలపై ఈ నెల 24-29 వరకు ప్రతి రైతు ఇంటికి ప్రజాప్రతినిధులు, అధికారులు వెళ్లనున్నారని, డిసెంబరు 3న రైతు సేవా కేంద్రాల పరిధిలో వర్క్‌షాపులు చేపట్టనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అనుబంధ రంగాలు, మార్కెటింగ్ శాఖ అధికారులు పాల్గొనాలన్నారు. అన్నదాతల సంక్షేమం కోసం సాగు విధానంలో తీసుకురావాల్సిన మార్పులపై సీఎం చంద్రబాబు ప్రకటించిన పంచసూత్రాలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రైతుసేవా కేంద్రాల్లోని సిబ్బంది ఈ కార్యక్రమంలో కీలకంగా వ్యవహరించాలని ఆదేశించారు. రైతులతో పాటు పాడిరైతులు, ఫౌల్ట్రీ, గొర్రెల పెంపకందారులు, ఆక్వా, ఉద్యాన, సెరీకల్చర్ రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రకృతి సేద్యాన్ని మరింతగా ప్రోత్సహించాలని, దీనివల్ల భూసార రక్షణతో పాటు ఆరోగ్యం కూడా బాగుంటుందన్నారు. రైతులు పండించే ఉత్పత్తులు రైతు బజార్లలో ప్రమోట్ చేయాలన్నారు. వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

ఎస్సీ, ఎస్టీ యువతకు ఉచితంగా సివిల్స్ కోచింగ్

- దరఖాస్తుకు ఈ నెల 26 వరకు గడువు
- అంబేడ్కర్ స్టడీ సర్కిల్ డైరక్టరు ప్రసన్న వెంకటేశ్



కడప ఎన్టీఆర్‌సర్కిల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగ యువతకు యూపీఎస్సీ సివిల్స్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నామని, అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని అంబేడ్కర్ స్టడీ సర్కిల్ డైరెక్టరు ఐఏఎస్ ప్రసన్న వెంకటేశ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 340 మంది నిరుద్యోగ ఎస్సీ, ఎస్టీ యువతకు యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమినరీ ఎగ్జామ్‌కు ఉచిత శిక్షణ ఇవ్వనున్నామని, విజయవాడ, విశాఖ, తిరుపతి డాక్టర్ అంబేడ్కర్ స్టడీ సర్కిళ్లలో ఈ శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. నాలుగు నెలల శిక్షణ కాలంలో అభ్యర్థులకు ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తామని, మహిళలకు 33 శాతం సీట్లు కేటాయిస్తామన్నారు. వివరాలకు ఏపీ స్టడీ సర్కిల్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

జిల్లాలో జోరుగా వర్షం

- 28 మండలాల్లో కురిసిన వాన

కడప కలెక్టరేట్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 28 మండలాల్లో శనివారం రాత్రి వర్షం జోరుగా కురిసింది. జిల్లా వ్యాప్తంగా సరాసరి 596.8 మి.మీటర్ల వర్షపాతం నమోదు కాగా, అత్యధికంగా చెన్నూరు మండలంలో 58.6 మి.మీ., అట్లూరు మండలంలో 45.8 మి.మీ., యర్రగుంట్ల మండలంలో 34.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఒంటిమిట్టలో 58.4 మి.మీ., ఖాజీపేటలో 52.4 మి.మీ., సిద్దవటం, కడప, కమలాపురం, వల్లూరు మండలాల్లో పోటాపోటీగా వర్షాలు కురిశాయి. కాగా కడప రెవెన్యూ డివిజన్ పరిధిలోనే 332.6 మి.మీ. వర్షపాతం నమోదు కావడం గమనార్హం.

నేడు డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ



కడప, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 24న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టరు శివశంకర్ లోతేటి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే డయల్ యువర్ సీఎండీ కార్యక్రమం ద్వారా తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి వినియోగదారులు మొబైల్ నెంబరు 8977716661కు కాల్ చేసి తమ విద్యుత్ సమస్యలను సీఎండీ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సదవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు మాజీ సీఎం జగన్ జిల్లా పర్యటన


పోలీసుల సివిల్ పంచాయితీలు

చర్యలు తీసుకోండి : ఎమ్మెల్యే వరద

వివరాలు 7లో

28 గ్రామాలకు రాకపోకలు బంద్

- సోమశిల వెనుకజలాల ఎఫెక్ట్..



సగిలేరు వంతెనపైకి చేరిన సోమశిల వెనక జలాలు


అట్లూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సోమశిల వెనుకజలాల కారణంగా పలు గ్రామాల ప్రజలకు రాకపోకలు నిలిచి పోయాయి. ఇళ్లల్లోకి నీరు చేరుతుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. మండలంలోని వేమలూరు సమీపంలో సగిలేరు వంతెన పైకి ఆదివారానికి 75 టీఎంసీల నీరు చేరింది. దీంతో 28 గ్రామాల ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీనికి తోడు ముంపు గ్రామాలైన చింటువాండ్లపల్లె, ఆకుతోటపల్లె గ్రామాలకు శనివారం అర్ధరాత్రి నుంచి వెనుకజలాలు చేరడంతో ఇళ్లల్లోకి నీరు చేరుతోంది. సంవత్సరాల కొద్దీ సగిలేరు హైలెవెల్ వంతెన నిర్మించకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నిత్యం అట్లూరు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాలంటే బద్వేలు మీదుగా 50 కి.మీ. దూరం ప్రయాణించాల్సి వుంటుంది. ప్రభుత్వాలు మారినా తమ తలరాతలు మారడం లేదంటూ ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో అయినా హైలెవెల్ బ్రిడ్జి నిర్మించి తమ కష్టాలు తీర్చాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. 15 ఏళ్ల క్రితం తమ ఊరి చుట్టూ ఉన్న పొలాలకు పరిహారం చెల్లించినా, తమ ఇళ్లకు పరిహారం చెల్లించలేదని వాపోతున్నారు. నీరు ఇళ్లల్లోకి చేరుతుండడంతో విషపురుగులు, పాములు వంటివి వస్తున్నాయని ముంపువాసులు భయాందోళన చెందుతున్నారు.



ముంపు గ్రామాలైన చింటువాండ్లపల్లె, ఆకుతోటపల్లె చేరిన సోమశిల వెనుకజలాలు

సెంట్రల్ జైల్లో భద్రత కరువు

- 134 మంది సిబ్బందికి గాను ఉన్నది 73 మందే
- వీరిలో డిప్యుటేషన్‌తో 12 మంది బయటే
- పగలు 30, రాత్రి 31 మందితోనే భద్రత సరి
- జైల్లో ఉగ్రవాదులు, కరుడుగట్టిన నేరస్తులు



(కడప-ఆంధ్రజ్యోతి): కడప సెంట్రల్ జైలు.. దీనికో చరిత్ర ఉంది. రాయలసీమలో ఉరి శిక్ష పడ్డ ఖైదీలు, ఉగ్రవాదులు, కరుడు గట్టిన నేరస్తులను ఇక్కడే ఉంచుతారు. జిల్లాతో పాటు అనంతపురం, చిత్తూరు, కర్నూలు ప్రాంతాల్లో శిక్షపడ్డ ఖైదీలను ఇక్కడికే పంపిస్తారు. అలాగే సమాజానికి ముప్పుగా పరిణమించే నేరస్తులను సైతం ఇదే జైలులో ఉంచుతారు. ఇది చాలా కీలకమైన జైలు. అయితే ఇక్కడ అవసరమైన భద్రతా సిబ్బంది లేకపోవడం ఆందోళనకరంగా మారింది. గతంలో ఇదే జైలు నుంచి నలుగురు ఖైదీలు సిబ్బంది కళ్లుగప్పి పారిపోయారు. ఈ నేపథ్యంలో కఠినతరమైన భద్రతా ఏర్పాట్లు చేయాల్సి ఉంది. అయినా ఇక్కడ తగినంత సిబ్బంది లేకపోవడం గమనార్హం.

కడప సెంట్రల్ జైల్లో ఖైదీలు 661 మంది ఉన్నారు. వీరిలో ఉరిశిక్ష పడ్డ వారు ఉన్నారు. ఒకరు కడప జిల్లాకు చెందిన వారు కాగా ఐదుగురు చిత్తూరు జిల్లా వాళ్లు. ఉగ్రవాదులు ఉన్నారు. మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, మన రాష్ట్రానికి చెందిన కరుడుగట్టిన నేరస్తులు, ఇంకా పీడీ యాక్టు నమోదైన 24 మంది నేరస్తులు ఉన్నారు. వీరిని ప్రత్యేక బ్యారక్‌లలో ఉంచారు. పీడీ యాక్టు నమోదు చేసిన వారికి ములాఖత్ ఉండదు. వీరంతా అంత డేంజరస్ నేరగాళ్లు. మిగిలిన వారంతా హత్య కేసులు, ఇతర నేరాల్లో శిక్ష పడ్డవారు.

గాలిలో దీపంలా భద్రత

తీవ్రమైన నేరగాళ్లు ఉన్న సెంట్రల్ జైలులో కట్టుదిట్టమైన భద్రత ఉండాలి. అందుకు తగిన సిబ్బంది ఉండాలి. కడప సెంట్రల్ జైలులో మొత్తం 134 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా.. 61 ఖాళీలున్నాయి. జైలు మెయింటెనెన్స్‌లో హెడ్‌వార్డర్లది కీ రోల్. ఇక్కడ 32 మంది ఉంటే రెకమండేషన్లతో 12 మంది డిప్యుటేషన్లపై వివిధ జైళ్లల్లో పనిచేస్తున్నారు. జీతాలు మాత్రం ఇక్కడే తీసుకుంటారు. 661 మంది ఖైదీలకు కేవలం 61 మంది భద్రతా సిబ్బందితో నెట్టుకొస్తున్నారు. పగటి పూట 30 మంది రాత్రి పూట 31 మంది మాత్రమే కాపలా ఉంటారు. ఎవరైనా సెలవు పెడితే సిబ్బంది సంఖ్య తగ్గుతుంది. ఖైదీలు అనారోగ్యానికి గురైతే వారిని ఆసుపత్రి తీసుకెళ్లేందుకు నలుగురు సిబ్బంది వెళతారు.

కరుడుగట్టిన నేరగాళ్లు ఉన్నప్పుడు తక్కువ మందితో భద్రత కల్పించడం ప్రమాదమని చెబుతున్నారు. సెంట్రల్ జైలుపై తీవ్ర ఆరోపణలున్నాయి. వివేకానందరెడ్డి హత్య కేసు నిందితులు జైలులో ఉన్నప్పుడు సకల మర్యాదలు చేశారని ఆరోపణలున్నాయి. సిబ్బంది కొరత కారణంగా సరైన తనిఖీలు లేకపోవడంతో గంజాయి సెల్‌ఫోన్ల వినియోగం విచ్చలవిడిగా సాగుతున్నట్లు చెబుతారు. ఇంత కీలకమైన జైల్లో ప్రభుత్వం తగినంత భద్రత కల్పించాల్సి ఉంది.

ఆశాజనకంగా వరి

● 10 వేల ఎకరాల్లో సాగు ● మెరుగైన దిగుబడిపై రైతుల ఆశలు


సాగులో ఉన్న వరి పంట

దువ్వూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలో సాగైన వరి పంట ఆశాజనకంగా ఉంది. ప్రస్తుతం పాలుపోసుకుని గింజలు కడుతున్నాయి. పంట కనిపిస్తున్న తీరును చూసి మెరుగైన దిగుబడులు అందుతాయని రైతులు పేర్కొంటున్నారు. కేసీ ఆయకట్టు పరిధిలో నీటి ఆధారంగా ఈ పంట విస్తృతంగా సాగు చేశారు. ఈ ఏడాది ముందుగానే వర్షాలు కురిసిన నేపథ్యంలో సకాలంలో కేసీ కాలువకు నీరు వచ్చింది. దీంతో నార్లుపోయడం, నాట్లు వేయడం జరిగిపోయింది. ఎడతెరపి లేకుండా వర్షాలు కురవడంతో వరికి మేలు జరిగింది. కేసీ ఆయకట్టు అంతా వరి పైర్లతో కళకళలాడుతోంది.

10 వేల ఎకరాల్లో వరి సాగు

మండల పరిధిలో పదివేల ఎకరాల్లో వరి సాగైనట్లు అధికారుల లెక్కలు తెలుపుతున్నాయి. ఈ-క్రాప్ నమోదైన లెక్కల ప్రకారం 8,360 ఎకరాల్లో సాగు చేశారు. ఇంకా ఈ-క్రాప్ నమోదు కాని, నాన్ ఆయకట్టు కింద, బోరుబావుల కింద మొత్తం కలిపి 10 వేల ఎకరాల్లో వరి సాగైనట్లు వ్యవసాయ శాఖ లెక్కలు తెలుపుతున్నాయి. ఈ ఏడాది స్థానిక కూలీలతో కాక ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కొత్త కూలీలతో నాట్లు వేయించారు. వీరు గాలిబాటలు ఏర్పాటు చేసే విధానం రైతులకు నచ్చి వారితోనే నాటించారు. వీరి వలన ఖర్చు కూడా తగ్గిందని రైతులు చెబుతున్నారు.

పెరిగిన సాగు ఖర్చులు

నాటు ఖర్చులు కొంత తగ్గినా వరి సాగు ఖర్చులు పెరిగాయి. ఎకరాకు రూ.25వేల నుంచి రూ.30వేలదాకా పెట్టుబడులు అయ్యాయని రైతులు అంటున్నారు. దుక్కుల దగ్గర నుంచి దమ్ము చేయడం, నాట్లు వేయడం, ఎరువులు, పురుగు మందుల వాడకం, కలుపుతీత ఖర్చులు తడిసి మోపెడు అవుతున్నాయని వాపోతున్నారు. ఖర్చులు నెత్తికెక్కినా మంచి దిగుబడులు అందుతాయనే ఆశాభావాన్ని రైతులు వ్యక్తపరుస్తున్నారు. మండలంలో దువ్వూరు, కానగూడూరు, జిల్లేళ్ల, పెద్ద జొన్నవరం, మురళీనగర్, ఎర్రబల్లి, మాచనపల్లి అన్నపుశాస్త్రులపల్లి, బుక్కాయపల్లె, నేలటూరు పరిధిలోని కేసీ ఆయకట్టులో వరి సాగు చేశారు. ఇవి కాక పలు గ్రామాల పరిధిలో చెరువులు, బోరుబావుల కింద వరి నాటారు.


గింజలు పోసుకుంటున్న వరి

అదనపు కట్నం కోసం వేధింపులు

కొండాపురం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తన భర్త జనార్దన్‌రెడ్డి అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని మండలంలోని డొంకపల్లె గ్రామానికి చెందిన తారాదేవి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. తారాదేవి మొదటి భర్త అనారోగ్యంతో మృతి చెందడంతో పులివెందులకు చెందిన జనార్దన్‌రెడ్డిని రెండేళ్ల కిందట వివాహం చేసుకుంది. ఈ క్రమంలో తన భర్త అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని, తనను బెదిరిస్తున్నాడని ఫిర్యాదు పేర్కొన్నారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

బస్సు ఢీకొని మహిళకు తీవ్ర గాయాలు

చెన్నూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక హైవే రహదారిలో కొత్తరోడ్డు వద్ద శనివారం రాత్రి 11గంటల ప్రాంతంలో రోడ్డు దాటుతున్న ఎర్రమల్ల తులశమ్మ (56) అనే మహిళను కడప నుంచి వస్తున్న బీసీ వీఆర్ ట్రావెల్స్ బస్సు ఢీకొనడంతో ఈమెకు తీవ్ర గాయాలయ్యాయి. పెండ్లిమర్రి మండలానికి చెందిన తులశమ్మ చెన్నూరులోని బంధువుల ఇంటికి వచ్చి రోడ్డు దాటుతుండగా కడప నుండి విజయవాడ వెళుతున్న బస్సు ఢీకొంది. తీవ్రంగా గాయపడ్డ తులశమ్మను 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ క్రిష్ణారెడ్డి తెలిపారు.

ఇరువురి మధ్య ఘర్షణ

చెన్నూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చెన్నూరు ఏపీజీబీ బ్యాంకు వద్ద ఆదివారం మధ్యాహ్నం ఇరువురి మధ్య గొడవ జరగడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. చెన్నూరుకు చెందిన షఫీవుల్లా ఆటోలో వస్తుండగా చెన్నూరు గ్రామం నుండి బుడ్డాయపల్లెకు వెళుతున్న అదే గ్రామానికి చెందిన వ్యక్తికి మధ్య గొడవ జరిగింది. ఈ ఘటనలో షఫీవుల్లా బుడ్డాయపల్లె యువకుడిపై దాడికి దిగాడు. అనంతరం షఫీవుల్లా వచ్చే దారిలో మరికొందరు అతనిపై దాడి చేశారు. ఈ సంఘటనపై ఇరువురి ఫిర్యాదు మేరకు ఇరువర్గీయులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

ముద్దనూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో స్మార్ట్ కిచెన్ భవన ఏర్పాటు విషయంలో జరిగిన ఘర్షణకు సంబంధించి ఆదివారం ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మైనుద్దీన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. శనివారం స్మార్ట్ కిచిన్ భవన ఏర్పాటు విషయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ విషయమై కులం పేరుతో దూషించారని ఆదినరసింహులు ఫిర్యాదు మేరకు రాజులగురువాయపల్లెకు చెందిన సురేంద్రనాథరెడ్డి, మరో 10 మందిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి పరిస్థితి విషమం

చాపాడు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేతవరం వద్ద ప్రొద్దుటూరు-మైదుకూరు రహదారిపై ఈనెల 22న శనివారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రవీణ్‌కుమార్ (30) తీవ్రంగా గాయపడినట్లు పోలీసులు తెలిపారు. ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన ప్రవీణ్ కుమార్ ద్విచక్ర వాహనంపై సొంత పని నిమిత్తం మైదుకూరు వెళ్లి తిరిగి వస్తుండగా కేతవరం బస్టాపు వద్ద అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో అతని తల, కాళ్లు, ఇతర భాగాలకు బలమైన గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్సకోసం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మాంసం దుకాణాలపై దాడులు

● కల్తీ మాంసం కాల్చివేత

వేంపల్లె, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): వేంపల్లెలోని మాంసం దుకాణాలపై పంచాయతీ ఈవో నాగభూషణంరెడ్డి ఆధ్వర్యంలో దాడులు చేశారు. కల్తీ మాంసం విక్రయిస్తున్నారన్న సమాచారం రావడంతో ఆదివారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు చోట్ల అనారోగ్యానికి గురైన గొర్రెల మాంసం విక్రయిస్తుండగా పట్టుకుని కల్తీ మాంసం విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్వాధీనం చేసుకున్న మాంసాన్ని కాల్చారు. ఎక్కడైనా కల్తీ మాంసం విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు.


కల్తీ మాంసాన్ని స్వాధీనం చేసుకున్న ఈవో

పోలీసుల సివిల్ పంచాయితీలు

● చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఫిర్యాదు

ప్రొద్దుటూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పోలీసులు బహిరంగంగా సివిల్ పంచాయితీలు చేయడంపై చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతానని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో తనికంటి జ్యువెలర్స్ యజమాని తనికంటి శ్రీనివాస్, అతని భార్య శ్రీలక్ష్మీతో కలిసి ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. తనికంటి శ్రీనివాస్, అతని సోదరుడు తనికంటి వెంకటస్వామిని పోలీసులు అక్రమంగా నిర్బంధించి చిత్రహింసలకు పెట్టి కోట్ల విలువైన ఆస్తిపత్రాలు, జ్యూవెలర్స్ షాపు తాళాలు ఇంటికి వచ్చి మరీ దౌర్జన్యంగా తీసుకెళ్లే అధికారం పోలీసులకు ఎవరిచ్చారని ప్రశ్నించారు. డబ్బులు బాకీ ఉంటే చట్టపరంగా వారిపై చర్యలు తీసుకోవాలని, అలాకాకుండా పోలీసులు చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని సివిల్ పంచాయితీల్లో జోక్యం చేసుకుని దారుణంగా కొట్టి తుపాకులతో బెదిరించడంపై తీవ్రంగా మండిపడ్డారు. ఇది ఎస్పీకి తెలియదని, ఆయన పైఉన్నతాధికారుల ఆదేశాలతోనే ఈ సివిల్ పంచాయితీల దందా కొందరు పోలీసులు సాగిస్తున్నారని ఆరోపించారు. ఇంత తతంగం జరుగుతున్నా స్థానిక డీఎస్పీ కనీసం నోరు మెదపడం లేదన్నారు. తన భర్త ఆచూకీ తెలపాలని శ్రీనివాస్ భార్య శ్రీలక్ష్మీ డీఎస్పీ కార్యాలయంలో మూడు గంటలున్నా స్పందించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా పోలీసులు శ్రీనివాస్ ఇంటినుండి బలవంతంగా తీసుకెళ్లిన ఆస్తిపత్రాలు, దుకాణం తాళాలు వారికి అప్పగించాలన్నారు. చట్టప్రకారం తనికంటి శ్రీనివాస్, వెంకటస్వామిపై కేసు వుంటే అరెస్టు చేయాలన్నారు. సమావేశంలో కౌన్సిలర్ వంగనూరు మురళీధర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు సోమా బాలయ్య, వద్దిబాలుడు, ఆడిటర్ పోలంకి వరదరాజులు, చెన్నా శ్రీనివాసులు పాల్గొన్నారు.


ఇంటికి వెళ్లి ఆస్తిపత్రాలు తీసుకుంటున్న సీఐ ఫొటోలు చూపిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

గోల్డ్ స్కీమ్ పేరుతో తనికంటి జ్యువెలర్స్ వసూళ్లు

● బంగారు, డబ్బులకు కస్టమర్లు ఆందోళన చెందవద్దు : శ్రీలక్ష్మి

ప్రొద్దుటూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): తనికంటి జ్యువెలర్స్ యజమాని తనికంటి శ్రీనివాస్ గోల్డ్ స్కీమ్ పేరుతో నెలకు రూ.50వేలు కంతు కట్టించుకున్నారని ఇటీవల అతనిపై పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారని తెలిసి తమ డబ్బులు ఇప్పించాలని ఒన్‌టౌన్ సీఐకి బాపతి సంధ్య ఆదివారం ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదులో.. మూడేళ్లుగా తమ కుటుంబానికి తనికంటి శ్రీనివాస్ పరిచయస్తుడని, గోల్డ్ స్కీమ్ ప్రారంభిస్తున్నానని, స్కీమ్‌లో చేరాలని చెబితే తమతో పాటు మరికొందరితో గోల్డ్ స్కీమ్ కట్టించామని పేర్కొన్నారు. అలాగే బంగారు ఆభరణాల కోసం బంగారు కూడా ఇచ్చామని, వాటన్నింటికి కలిపి రూ.9.50 లక్షలు రావాల్సివుందని, అది తమకు ఇప్పించాలని ఆమె కోరారు. ఇదిలా వుండగా తనకంటి జ్యువెలర్స్ యజమాని శ్రీనివాస్ భార్య శ్రీలక్ష్మి వన్‌టౌన్ పోలీసుస్టేషన్ వద్ద విలేకరులతో మాట్లాడుతూ పోలీసులు తమ కస్టమర్లను భయపెట్టి వారితో బలవంతంగా ఫిర్యాదులు ఇప్పిస్తున్నారని, తమ దగ్గర స్కీములో ఉన్న వారికి గానీ, ఆభరణాల కోసం బంగారు ఇచ్చిన వారికి గానీ ఎటువంటి ఆందోళన చెందవద్దని తెలిపారు. పుకార్లను నమ్మవద్దని కోరారు. తమ దుకాణం తాళాలను పోలీసులు అక్రమంగా వారివద్ద వుంచుకున్నారన్నారన్నారు.

తుదిశ్వాస వరకు పేదల సేవకే అంకితం

● ముక్కా రూపానందరెడ్డి ● ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన


వైద్యశిబిరానికి వృద్ధులను తీసుకెళ్తున్న ముక్కా రూపానందరెడ్డి... హాజరైన జనం

రైల్వేకోడూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): తన తుది శ్వాస వరకు పేదల సేవకే అంకితం అవుతానని టీడీపీ ఇన్‌చార్జ్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి తెలిపారు. ఆదివారం వెంకటేశ్వర అరవింద కంటి ఆస్పత్రి సహకారంతో పట్టణంలోని హెచ్ఎంఎం హైస్కూలు ఆవరణంలో ముక్కా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన వచ్చిందన్నారు. ప్రతి ఒక్క పేద కుటుంబానికి కంటి చూపు కల్పించాలన్న ఉద్దేశంతో ఇలాంటి వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ శిబిరానికి రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి, పుల్లంపేట, పెనగలూరు మండలాల నుంచి సుమారు మూడువేల మంది హాజరయ్యారు. కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా కళ్లజోళ్లు, మందులు పంపిణీ చేశారు. అలాగే సుమారు 200 మందికి ఆపరేషన్లు చేశారు. జనసేన ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ మాట్లాడుతూ ఇలాంటి సేవా కార్యక్రమాలను ముక్కా ఫౌండేషన్ వేగంగా నిర్వహిస్తోందన్నారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కూటమి యువ నాయకుడు పోతురాజు నవీన్, పోతురాజు సుమన్, నార్జాల హేమరాజ్, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ పఠాన్ మౌలా, నాయకులు బత్తిన వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం - రాగి వైరు చోరీ

ములకలచెరువు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దపాళ్యం ఫ్లైఓవర్ సమీపంలో శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి రాగి వైరును చోరీ చేశారు. కొత్తగా నిర్మిస్తున్న పాఠశాల భవనాల వద్ద ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేశారు. ఈ విషయమై వాచ్‌మాన్ వెంకటరమణ పోలీసుల దృష్టికి తీసుకెళ్లాడు.



కడుపు నొప్పితో హోంగార్డు మృతి

మదనపల్లె అర్బన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కడుపు నొప్పి రావడంతో మదనపల్లె తాలుకా పోలీస్‌స్టేషన్ హోంగార్డు ఆర్‌వీ రమణ(47) ఆదివారం మధ్యాహ్నం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... చిత్తూరు జిల్లా సోమల మండలం నంజంపేటకు చెందిన ఆర్‌వీ రమణ ఆదివారం తాలుకా పోలీస్‌స్టేషన్‌లో విధులకు హాజరై మధ్యాహ్నం భోజనానికి తట్టివారిపల్లెకు వెళ్లాడు.

ఇంట్లో కడుపునొప్పి రావడంతో వెంటనే స్థానికులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన డాక్టర్లు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య కూతురు, కొడుకు ఉన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి కృషి

● ఏపీ ఫిషర్‌మెన్ కోఆపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్ లిమిటెడ్ చైర్మన్ యాటగిరి రాంప్రసాద్



మాట్లాడుతున్న యాటగిరి రాంప్రసాద్

కడప మారుతీనగర్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మత్స్యకారుల సంక్షేమానికి అవిశ్రాంతంగా కృషి చేస్తానని ఏపీ స్టేట్ ఫిషర్మెన్ కోఆపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్ లిమిటెడ్ చైర్మన్ యాటగిరి రాంప్రసాద్ స్పష్టం చేశారు. ఆదివారం టీడీపీ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్న నందమూరి తారకరామరావు హయాం నుండి ప్రస్తుతం సీఎం చంద్రబాబునాయుడు వరకు బీసీలకు అండగా నిలుస్తూ సముచిత స్థానం కల్పించడంలో చొరవ చూపుతున్నారన్నారు. తనపై విశ్వాసంతో పదవి కల్పించిన నాయకుల ఆకాంక్షలకనుగుణంగా సేవలందిస్తానన్నారు. ముఖ్యంగా మత్స్యకారుల సమస్యలను పరిష్కరించి పదవికి వన్నె తెచ్చేలా పాటుపడతామన్నారు. వైసీపీ జిల్లా నాయకులు చిల్లర రాజకీయాలకు స్వస్తిపలకాలన్నారు. కడప సమగ్రాభివృద్ధికి ఎమ్మెల్యే మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి చొరవ చూపుతున్నారన్నారు. అయినప్పటికీ వైసీపీ నాయకులు సిగ్గు లేకుండా అవాకులు చవాకులు పేలడం మానుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.అమర్‌నాథరెడ్డి, నగర ప్రధాన కార్యదర్శి సుబ్బారెడ్డి, నగర అధ్యక్షుడు మన్సూర్ ఆలీఖాన్ పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా జనసేన

నిమ్మనపల్లి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా నిలుస్తుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ప్రదీప్ అన్నారు. ఆదివారం విజయవాడ మంగళగిరిలో జరిగిన జనసేన కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 2024 సెప్టెంబరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కార్యకర్త నిమ్మనపల్లి మండలం తవళం పంచాయతీ చౌకిళ్లవారిపల్లి వాసి గుమ్మడి శివ కుటుంబానికి ఆర్థికసాయం అందించారు. ఆ వేదికపై ఎమ్మెల్సీ నాగబాబు రూ.5లక్షల చెక్కును మృతుడి భార్య జ్యోతికి అందజేశారు. అలాగే రాష్ట్రంలో మొత్తం 220 మంది కార్యకర్తల కుటుంబాలకు సహకారం అందించినట్లు ఆయన తెలిపారు.

దువ్వూరు కార్యకర్తకు ఆర్థికసాయం

దువ్వూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం జిల్లేళ్ల గ్రామానికి చెందిన దూదేకుల హుస్సేన్‌బాషా కుటుంబానికి ఆదివారం జనసేన పార్టీ తరపున రూ.5 లక్షల ఆర్థికసాయం అందించారు. ఈ మేరకు తాడేపల్లిలోని అన్నపూర్ణ కన్వెన్షన్ హాలులో ఎమ్మెల్సీ నాగబాబు చేతుల మీదుగా చెక్కును మృతుడి తల్లి ఓబుళమ్మకు అందజేసినట్లు మైదుకూరు నియోజకవర్గ జనసేన నాయకుడు పాశం లక్ష్మినరసయ్య తెలిపారు.

గండికోట ప్రాజెక్టులో 26.4 టీఎంసీలు

కొండాపురం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టులో ఆదివారం 26.4 టీఎంసీల నీటిమట్టం ఉన్నట్లు ఈఈ ఉమామాహేశ్వర్లు తెలిపారు. ప్రస్తుతం తాగునీటి అవసరాల దృష్ట్యా 20 క్యూసెక్కుల నీరు మాత్రమే బయటికి వదులుతున్నామన్నారు.అదేవిధంగా ప్రస్తుతం ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో లేదని ఈఈ తెలిపారు. కాగా గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 26.85 టీఎంసీలు. ఫోటో 23కొండా1 గండికోట ప్రాజెక్టులో ప్రస్తుత నీటిమట్టం

25,26 తేదీల్లో మాజీ సీఎం జగన్ జిల్లా పర్యటన

పులివెందుల, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 25, 26వ తేదీల్లో జిల్లాకు రానున్నారు. 25వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటలకు బెంగుళూరులో 3గంటలకు హెలికాప్టర్ ద్వారా బయలుదేరుతారు. 3.50గంటలకు పులివెందులలోని భాకరాపురం హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డుమార్గాన భాకరాపురంలోని క్యాంప్ కార్యాలయానికి చేరుకుని 7గంటల వరకు అక్కడే ఉంటారు. అనంతరం భాకరాపురంలోని ఇంటికి చేరుకొని అక్కడ బస చేస్తారు. 26వ తేదీ ఉదయం 8.45గంటలకు బయలుదేరి 9గంటలకు పులివెందులలోని వాసవి ఫంక్షన్ హాల్‌కు చేరుకుని వివాహ వేడుకల్లో పాల్గొంటారు. అనంతరం 10గంటలకు బయలుదేరి పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లెలో అరటి తోటలను పరిశీలిస్తారు. అనంతరం 11.30గంటలకు పులివెందులలోని లింగాల మాజీ సర్పంచు మహేష్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తారు. అక్కడి నుంచి బయలుదేరి 12.30గంటలకు భాకరాపురంలోని తన ఇంటికి చేరుకుంటారు. అక్కడి నుంచి 2గంటలకు బయలుదేరి వేముల మండలంలోని వేల్పుల గ్రామంలోని లింగాల రామలింగారెడ్డి ఇంటికి చేరుకుంటారు. అక్కడి నుంచి 2.50కి బయలుదేరి 4గంటలకు పులివెందులలోని భాకరాపురం క్యాంప్‌కార్యాలయానికి చేరుకుని 7గంటల వరకు అక్కడే ఉంటారు. 7.05గంటలకు భాకరాపురంలోని తన ఇంటికి చేరుకుని రాత్రికి అక్కడే బస చేయనున్నట్లు వైసీపీ వర్గాలు తెలిపాయి.

పోటీల విజయవంతానికి సమష్టిగా కృషి చేయాలి

● విద్యార్థి వ్యవహారాల డీన్ డాక్టర్ జి.రామచంద్రారావు సూచన

పులివెందుల, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జరిగే అంతర కళాశాలల పోటీల విజయవంతానికి సమష్టిగా కృషి చేయాలని విద్యార్థి వ్యవహారాల డీన్ డాక్టర్ జి.రామచంద్రరావు సూచించారు. ఈనెల 24నుంచి 26వ తేదీ వరకు పులివెందుల ఆహార విజ్ఞాన శాస్త్ర, సాంకేతిక కళాశాలలో జరిగే క్రీడలు, ఆటలు, సాంస్కృతిక, సాహిత్య పోటీల ఏర్పాట్లపై ఆదివారం స్థానిక కళాశాల అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి సంబంధించిన 19 కళాశాలల విద్యార్థుల జట్లు పాల్గొంటున్నాయన్నారు. పోటీలకు చేసిన ఏర్పాట్లను పులివెందుల కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.మాధవను అడిగి తెలుసుకున్నారు. ఫుడ్, రవాణా, వేదిక అలంకరణ, స్పోర్ట్స్, వసతి ఏర్పాట్లను డీన్ డాక్టర్ ఎం.మాధవ వివరించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ పర్యవేక్షకుడు డాక్టర్ ఆర్.రవికాంత్‌రెడ్డి, పీడీ డాక్టర్ రాజశేఖర్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో బంగారు వ్యాపారి

● వెంకటస్వామి అరెస్టుకు తాడిపత్రికి వెళ్లిన సీఐ తిమ్మారెడ్డి

ప్రొద్దుటూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరులో బంగారు వ్యాపారి తనికంటి శ్రీనివాస్, అతని సోదరుడు వెంకటస్వామిలను శుక్రవారం రాత్రి పోలీసులే కిడ్నాప్ చేసి అక్రమంగా నిర్బంధించి చిత్రహింసలు పెట్టడంపై ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి జోక్యంతో శనివారం రాత్రి పోలీసులు వారిని ఇంటి వద్ద వదిలేసి ఆస్తిపత్రాలు, దుకాణం తాళాలు తీసుకెళ్లడం తెలిసిందే. ఆదివారం ఉదయం తనికంటి శ్రీనివాస్‌ను వన్‌టౌన్ సీఐ తిమ్మారెడ్డి పోలీసుస్టేషనుకు పిలిపించారు. త్రీటౌన్ పోలీసు స్టేషన్లో నమోదైన కేసు విషయమై శ్రీనివాస్‌ను అదుపులోఉంచుకున్నారు. కారు తీసుకొని తాడిపత్రిలో వదిలిన తనికంటి శ్రీనివాస్ సోదరుడు వెంకస్వామిని అరెస్టు చేయడానికి సీఐ తిమ్మారెడ్డి వెళ్లారు. అక్కడ వెంకటస్వామి పోలీసులను ఇంట్లోకి రానీయకుండా తలుపులు వేసుకున్నాడు. పోలీసులను నమ్మి రానని తేల్చిచెప్పడంతో అతన్ని అరెస్టు చేసి తీసుకురావడానికి సీఐ తాడిపత్రిలోనే ఉన్నాడు. ఈ క్రమంలో శ్రీనివాస్‌ను వన్‌టౌన్ స్టేషన్‌లోనే రాత్రికి ఉంచారు. నవంబరు 20న నమోదైన కేసులో వీరిద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు పెట్టడానికి పోలీసులు యత్నిస్తున్నారు. అయితే రూ.8కోట్ల విలువైన ఆస్తిపత్రాలు తనికంటి జ్యువెలర్స్ తాళాలు పోలీసులు అక్రమంగా ఇంటి నుంచి తీసుకెళ్లడంపై పోలీసులు ఎలాంటి వివరణ మీడియాకు ఇవ్వడం లేదు.

'డ్రైవర్లూ.. స్టాప్..వాష్ అండ్ గో..'



కడప క్రైం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రహదారులపై రోడ్డు ప్రమాదాలు జరగకుండా స్టాప్.. వాష్.. అండ్ గో కార్యక్రమం పోలీసు యంత్రాంగం చేపడుతోంది. జిల్లాలోని రహదారులపై బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా పోలీసు అధికారులు తమ సిబ్బందితో కలిసి అర్ధరాత్రి దాటాక లారీలు, బస్సులు, ట్రాక్టర్లు, వ్యాన్లు తదితర వాహనాలను ఆపి డ్రైవర్లకు మంచినీళ్లు అందించి ముఖం శుభ్రం చేసుకున్న తర్వాత పంపుతున్నారు. వాహనాలు నడిపే సమయంలో డ్రైవర్లు తమ కుటుంబ సభ్యుల గురించి ఆలోచించి సురక్షితమైన ప్రయాణం చేయాలని పోలీసు అధికారులు సూచించారు.

వర్షానికి కుదేలైన రైతు



చిన్నమాచుపల్లె సమీపంలో ఆరబెట్టిన వరిధాన్యం

చెన్నూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వరి మండల వ్యాప్తంగా పలు చోట్ల కోతకు చేరుకుంది. ముఖ్యంగా రామన పల్లె తదితర ప్రాంతాల్లో కోసిన ధాన్యాన్ని ఆరబెట్టుకునే రైతులకు అకాల వర్షం శాపంగా మారింది. అల్పపీడనంతో కురిసిన వర్షం ఆరబెట్టి ఉన్న ధాన్యాన్ని తడిపేస్తోంది. నిరంతరాయంగా వర్షం కురుస్తుండడంతో ధాన్యం కుప్పలపై పట్టలు కప్పినా వర్షం నీరు నిలిచి అవి ధాన్యం తడుస్తోంది. దీంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్తీక మాసం పోయినా, ఈ అకాల వర్షాలు, రైతులను నష్టపరిచేందుకు వస్తున్నాయ నంటున్నారు. మండలంలో ఇప్పటికే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కొంటామని అధికారులు చెప్పడం, రైతులతో మాట్లాడడం జరిగింది. రైతులు బయట దళారుల ధర కన్నా ప్రభుత్వ ధరనే బాగుందని వరిని కోసి ఆరబెట్టుకుంటుంటే ఈ అల్ప పీడనం వల్ల కురిసే వర్షం ఆ ధాన్యాన్ని తడిపేస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో కొద్దిగా తడిచిన ధాన్యం అయినా పెద్దగా ఇబ్బంది లేదు కాబట్టి ప్రభుత్వమే కొనుగోలు చేసి మంచి ధర ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

'అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణం'

కడప మారుతీనగర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ కడప ఎమ్మెల్యే మాధవి, అలాగే జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డిపై వైసీపీ నేతలు పదే పదే అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమని టీడీపీ బీసీ నాయకుడు చిట్టి బోయిన సుబ్బరాయుడు యాదవ్ అన్నారు. ఆదివారం కడప టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వైసీపీ పాలనలో మాజీ ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా సొంత కార్యకర్తలకు కడపలోనే అన్యాయం చేశారన్నారు. కనుకనే గత ఎన్నికల్లో ఓటమి పాలయ్యారని అన్నారు. కడప ప్రజల సొమ్ముతో తమ్ముడిని దుబాయ్‌కి పంపించి రెస్టారెంట్ల వ్యాపారం మొదలు పెట్టావని ధ్వజమెత్తారు. వాగులు వంకలు అక్రమ లేఅవుట్లతో సంపాదించి ఇవాళ బుద్ధిమంతుడిలాగా మాట్లాడటం దారుణమన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు శ్రీనివాసయాదవ్, అక్షయ శ్రీనివాసమూర్తి, చిన్నబాబు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలకు విశేష స్పందన

కడప ఎడ్యుకేషన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలకు విశేష స్పందన లభించింది. కార్యక్రమాన్ని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జన విజ్ఞాన వేదిక గౌరవ సలహాదారుడుకృష్ణారెడ్డి, జేవీవీ రాష్ట్ర నాయకులు రాజశేఖర్ రాహుల్, ఎస్వీ ఇంజనీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ సుదర్శన్‌రెడ్డి కలిసి ప్రారంభించారు. ఈ సైన్స్ సంబరాల్లో ప్రభుత్వ పాఠశాలల నుంచి 21 జట్లు, ప్రైవేట్ పాఠశాలల నుంచి 16జట్లు పాల్గొని తమ ప్రతిభను, శాస్త్రీయ నైపుణ్యాలను ప్రదర్శించాయి. సైన్స్ సంబరాలను జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సమీర్ బాష, శివరాం, జిల్లా కమిటీ సభ్యులుపర్యవేక్షించారు.

ఇస్కాన్ ఆధ్వర్యంలో శోభాయాత్ర



సీకేదిన్నె, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇస్కాన్ ఆధ్వర్యంలో శోభాయాత్ర విజయవంతంగా జరిగింది. మండలంలోని కొలుములపల్లె పంచాయతీ, లింగారెడ్డి, పడిగెలపల్లి, కృష్ణాపురం గ్రామాల్లో ఆదివారం సాయంత్రం హిమాలయాల్లోని చార్‌దామ్ నుంచి వచ్చిన ఇస్కాన్ సంస్థవారు శోభాయాత్ర నిర్వహించి శ్రీకృష్ణ తత్వం బోధించారు. ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని అంర్జాతీయ శ్రీకృష్ణ సంఘం కడపశాఖ ఆధ్వర్యంలో ఎద్దులతో రథం లాగించి వీధుల్లో భగవద్గీత ప్రవచనం, కీర్తనలు ఆలపిస్తూ మహాహారతి, ప్రసాదం అందిస్తూ శోభయాత్రను నిర్వహించారు. స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

లోపించిన పారిశుధ్యం..!



బురదమయంగా మారిన ప్రధాన రోడ్డు

విష జ్వరాలతో అల్లాడుతున్న జనం

కమలాపురం రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పలు గ్రామాల్లో పారిశుధ్యం లోపించింది. వరుస తుపానులతో గ్రామీణ ప్రాంతాల్లో నీరు నిలిచి దోమలు వృద్ధి చెందుతున్నాయి. అవి ప్రజలపై దాడి చేయడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఇంత జరుగుతున్నా పారిశుధ్యపై అధికారులు పట్టించుకోవడంలేదు. గ్రామీణ ప్రాంతాల్లో జ్వరాలు తగ్గకపోవడంతో ప్రొద్దుటూరు, ఎర్రగుంట్ల, కమలాపురంలోని ప్రైవేటు హాస్పిటల్‌కు పోయి వేలకు వేలు ఖర్చు పెట్టుకుంటున్నారు. ఎర్రగుడిపాడు గ్రామంలో ఏ ఇంట చూసినా జ్వర పీడితులున్నారు. ముఖ్యంగా మండలంలోని ఆయా ఎస్సీ కాలనీల్లో మోకాలి లోతు నీళ్లు నిలిచిపోతుండడంతో డ్రైనేజీ లేక దుర్గంధం వెదజల్లుతూ ప్రజలు అవస్థలు పడుతు న్నారు. చిన్న పిల్లలు వృద్ధులు, పాఠశాలలకు, బయటికి పనుల నిమిత్తం రావాలంటే మురుగునీటితో ఇబ్బందులు పడుతన్నారు. ఇది ఒక్క చోట సమస్య కాదు, పల్లెల్లో ఎక్కడ చూసినా ఈ సమస్య ఉంది. అధికారులు ఈ విషయంపై పట్టించుకోవాలని కోరుతున్నారు.





జ్వరంతో బాధపడుతున్న బాలుడు, గ్రామంలో పర్యటిస్తున్న జిల్లా వైద్యాధికారి నాగరాజు

వైద్యశిబిరం ఏర్పాటు చేస్తాం..: ఎర్రగుడిపాడు గ్రామంలో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారన్న విషయం తెలుసుకున్న జిల్లా వైద్యాధికారి నాగరాజు ఆదివారం ఉదయం ఆ గ్రామంలో పర్యటించారు. గ్రామంలోని ఎస్సీ, బీసీ కాలనీలను సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎర్రగుడిపాడులో పరిశుభ్రత లోపించిందన్నారు. రోడ్లపై నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు వృద్ధి చెంది రోగాల వ్యాప్తికి కారణమవుతు న్నాయన్నారు. ఇక్కడ మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని స్థానిక ఏఎన్ఎంలకు పీహెచ్‌సీ డాక్టర్లకు సూచించారు. అలాగే విషజ్వరాలు ఉన్న చోట బ్లీచింగ్ పౌడరు, మురుగుగుంటల్లో కెమికల్స్ బాల్స్ చల్లాలని తెలిపారు. ఆయన వెంట వైద్యాధికారులు ఖాజామొద్దీన్, కాళహస్తీశ్వర్‌రెడ్డి, కమాల్‌బీ, హెచ్‌పీ సుష్మా, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సేవే పరమావధి.. మానవతా సంస్థ విధి



రామాంజులరెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

చెన్నూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మానవ సంస్థ ఏర్పాటు చేసిందే సేవ కోసమని ఇందులో మానవతా హృదయం గల ప్రతి ఒక్కరూ సభ్యులుగా ఉండవచ్చని ఆ సంస్థ రాష్ట్ర సభ్యుడు రామాంజులరెడ్డి అన్నారు. మండలంలోని రామనపల్లెలో ఆదివారం మానవతా సంస్థ మండల శాఖ అధ్యక్షుడు లేవాక సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహిం చారు.

ఈ సందర్భంగా రాష్ట్ర సభ్యుడు మాట్లాడు తూ ప్రతి యేటా సంస్థలో వందలాది మంది సభ్యులుగా చేరుతున్నారని ఇప్పటికే దాదాపు 90వేల వరకు సభ్యులయ్యారన్నారు. దాదాపు 1400 మందికి పైగా శాఖలతో సేవ కోసం రాష్ట్రవ్యాప్తంగా ఆయా మండలాల్లో సంస్థ పనిచేస్తోందన్నారు. అనంతరం రామన పల్లె మాజీ సర్పంచ్ రామన శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో రామాంజు లరెడ్డిని మండల శాఖ అధ్యక్షులు సన్మానించారు. కార్యక్ర మంలో ఎంపీపీ చీర్ల సురేశ్ యాదవ్, ఉపసర్పంచ్ వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలి



మాట్లాడుతున్న న్యాయవాది దాదా హయాత్

కడప ఎడ్యుకేషన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): భగవద్గీత, ఖురాన్, బైబిల్ మాదిరిగా భారత రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని జిల్లా అభ్యుదయ వేదిక నాయకుడు కె.సురేష్‌బాబు తెలిపారు.ఆదివారం కడప నగరం ఎస్టీయూ భవనంలో భారత రాజ్యాంగం-ప్రజాస్వామ్యం-ప్రాథమిక హక్కులు అనే అంశంపై అభ్యుదయ వేదిక,జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు ప్రముఖ న్యాయవాది ఎస్.దాదాహయాత్, కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి జి.చంద్ర, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.విశ్వనాథ, ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు ఎన్.సంగమేశ్వర్‌రెడ్డి మరికొంత మంది ప్రముఖులు ప్రసంగించారు. న్యాయవాది దాదా హయాత్ మాట్లాడుతూ 75ఏళ్ల చరిత్రలో భారత రాజ్యాంగం ఎన్నో ఒడిదుడులకును ఎదుర్కొన్నా, ఇంకా పదిలంగా నిలబడిందని చెప్పారు.

మహిళలకు వజ్రాయుధం శక్తి యాప్ : డీఎస్పీ

మైదుకూరు నవంబరు23 (ఆం ధ్రజ్యోతి): మహిళలకు శక్తి యాప్ వజ్రా యుధంలాంటిదని మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. వార్షిక తనిఖీ లలో భాగంగా మైదుకూరు అర్బ న్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం డీఎస్పీ ఆకస్మిక తనిఖీలు నిర్వ హించారు. ఈ సందర్భంగా అత్యావసర పరిస్థితులలో మహిళలకు ఆయుధం అయిన శక్తి యాప్ పోస్టర్లను పోలీసులచే ఆయన ఆవిష్కరించారు. ఈ రందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల భద్రత కోసమే శక్తి యాప్‌ను రూపొందించారన్నారు. స్థానిక ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా జాగ్రత్తగా విధులను నిర్వర్తించాలని పోలీసులను హెచ్చరించారు. ప్రజలకు శాంతిభద్రతలను కల్పించడంలో శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం కార్యాలయ రికార్డులను పరిశీలించారు.

'న్యాయం చేసి పుణ్యం కట్టుకోండి'

కడప మారుతీనగర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తన భర్త చనిపోయి 12 సంవత్సరాలు అవుతున్నా అత్త, మామ తనను తీవ్ర మానసిక హింసకు గురి చేస్తున్నా రని చింతకొమ్మదిన్నె మండలం కొలుములపల్లె పంచాయతీ వేపమాను సత్రం గ్రామానికి చెందిన బుక్కే యశోద ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తన భర్త పేరుతో ఉన్న స్థలాన్ని కూడా తనకు దక్కకుండా చేస్తున్నారని ఆరోపించారు. పైగా తనను ఆ ఊరిలో నుంచి లేకుండా చేయాలను కుట్రతో నానా చిత్రహింసలు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తన భర్త బతికుండగా మరో మహిళతో అక్రమ సంబంధం పెట్టుకుని తన బంగారాన్ని కూడా ఆమెకే ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. అనారోగ్యం బారిన పడి చనిపోయారన్నారు అధికారులు స్పందించి తనకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. ఈ సమావేశంలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు జగన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వాన్ని మార్చగలిగేది భాషోపాధ్యాయులే



మాట్లాడుతున్న మాడుగుల నాగఫణిశర్మ

కడప ఎడ్యుకేషన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల వ్యక్తిత్వాన్ని మార్చ గలిగేది భాషోపాధ్యాయులేనని పద్మశ్రీ మాడుగుల నాగఫణిశర్మ తెలిపారు. ఆదివారం నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో రాష్ట్ర భాషోపాధ్యాయసంస్థ, సంస్కృతి సేవా సమితి ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ప్రతిభా పరీక్ష నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన మాడుగుల నాగఫణిశర్మ భాష ప్రాధాన్యం,రామాయణం విలువలను వివరించి, చివరగా భక్తిగానం చేశారు. ప్రతిభా పరీక్షలో విజేతలకు శర్మ చేతులమీదుగా బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, జిల్లాలోని భాషా ఉపాధ్యాయులు, విద్యార్థులు, సాహితీ ప్రముఖులు పాల్గొన్నారు.

శిక్షణ ద్వారా నైపుణ్యాన్ని పెంపొందించుకోండి

కడప ఎన్టీఆర్ సర్కిల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) :శిక్షణ ద్వారా అభ్యర్థులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ జి.రాజ్యలక్ష్మి అన్నారు. ఆదివారం డీఆర్‌డీఏ సిడాప్ - డైరెక్ట్ ప్లేస్‌మెంటు ద్వారా జిల్లాలోని నిరుద్యోగ యువతకు మెగా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ - సోలార్ పవర్ ప్రాజెక్టులో వివిధ ఉద్యోగాలకు విశ్వేశ్వరయ్య భవనంలో ఆదివారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపికైన 119 మందికి సోమవారం నుంచి సర్టిఫికెట్ల పరిశీలన, ఫైనల్ రౌండ్ ఇంటర్వ్యూ హైదరాబాదు నుంచి నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ జీఎం శ్రీనివాసులు, డిప్యూటీ హెచ్‌ఆర్ మేనేజరు శ్రవణ్‌కుమార్, డీఆర్‌డీఏ - సిడాప్ జిల్లా జాబ్స్ మేనేజరు వీసీ హెచ్ రంగస్వామి, మెగా ఇంజనీర్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ హెచ్‌ఆర్ ప్రతినిధులు, సిడాప్ డైరెక్ట్ ప్లేస్‌మెంట్ ట్రైనర్ పృథ్వీరాజ్, పెంచలయ్య ,సిడాప్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాల పండుగ



చక్రాయపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలేకాంపల్లె గ్రామ పంచాయతీలోని సీతారాంపల్లెలో ఆదివారం ఘనంగా బోనాల పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాలో అమ్మవారు విగ్రహం ఏర్పాటుచేసిన సందర్భంగా ఆగ్రామస్థులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. అమ్మవారు ప్రత్యేక అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చింది. ప్రతి ఇంటి నుంచి బోనాల అమ్మవారికి సమర్పించి ఘనంగా పండుగ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి, చిలేకాంపల్లె గ్రామ ఇన్‌చార్జి పెద్దమావిరెడ్డిగారి మామిరెడ్డి, లోమడ వెంకటరామిరెడ్డి, గంగమ్మ ఆలయ కార్య నిర్వాహకులు హోమం నిర్వహించిన వారు కొవ్వూరు హరినాథ అన్నదాతలు (విశ్రాంతి ఉపాధ్యాయుడు) కొవ్వూరు రఘురామయ్య, గుండ్లమడుగు అంజనేయులు అమ్మవారి పువ్వుల అలంకరణ, వెంకటేశ్,ప్రవీణ్‌కుమార్, తేలూరు బాల ఓబయ్య, పగడపూల దేవరాజు, మండల ఏసన్న, గోగుడుపాలెం రామాంజనేయులు, చాగలమర్రి మల్లేశు, పాలగిరి చెన్నయ్య పాల్గొన్నారు.

'అనుమతిలేని వ్యాపార సముదాయం పనులు ఆపాలి'

కడప సెవెన్‌రోడ్స్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కోట్ల విలువైన జడ్పీ స్థలాల్లో వ్యాపార సముదాయ నిర్మాణాల పేరుతో అధికార పార్టీ నేతలు ఆదాయ వనరుగా మార్చుకుంటున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర అన్నారు. సిటీ ప్లానింగ్ అనుమతి లేకుండా పాత బస్టాండ్ వద్ద యాదాళ్ల పిచ్చయ్య చారిటీ స్థలంలో నిర్మిస్తున్న వ్యాపార సముదాయం పనులు ఆపాలని ఆదివారం సీపీఐ ప్రతినిధి బృందం పరిశీలనలో డిమాండ్ చేశారు. సదరు స్థలంపై రూ.48లక్షల పన్ను బకాయిలు ఉన్నాయని తెలిపారు. అనుమతి లేకుండా నిర్మిస్తున్న వ్యాపార సముదాయాల నిర్మాణం ఆపే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి ఎన్.వెంకటశివ, జిల్లా కార్యవర్గ సభ్యులు జి.వేణుగోపాల్, కేసీ బాదుల్లా, సహాయ కార్యదర్శి బి.శంకర్‌నాయక్, కె.మునెయ్య, భాగ్యలక్ష్మి,లింగన్న, గౌస్ తదిరులు పాల్గొన్నారు.

ఉర్దూ సాహిత్య ప్రగతిలో ప్రథమ స్థానంలో కడప



అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న దృశ్యం

కడప కల్చరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఉర్దూ సాహిత్య ప్రగతిలో ప్రథమ స్థానంలో కడప ఖ్యాతిగాంచడం హర్షణీయమని టీడీపీ మైనార్టీ నాయకుడు వీఎస్ అమీర్‌బాబు అన్నారు. ఆదివారం ఉర్దూ భాషా వికాసానికి, సాహిత్య ప్రగతికి విశేష కృషి చేసిన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు బెస్ట్ ఎక్సలెన్సీ అవార్డు గ్రహీతలకు , జీవిత సాఫల్య అవార్డుగ్రహీతలకు, మౌలానా అబుల్ కలాం ఆజాద్ అవార్డు గ్రహీతలకు అభినందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. స్థానిక క్రిసెంట్ ఇంగ్లీషు మీడియం హైస్కూలులో అబ్దుల్ మసీద్ విద్యాసంక్షేమ సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర ఉర్దూఅకాడమీ అవార్డు గ్రహీతలకు సత్కార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అమీర్‌బాబు హాజరై మాట్లాడారు. ఉ ఉర్దూ హిందీ భాష విద్యా సాహితీ సేవకుడు సయ్యద్ నజీర్, సత్తార్‌ఫైజీ, ఫర్హతుల్లా, మసీంసాహెబ్, జిలాన్‌లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పలువురు ఉర్దూ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'పులివెందులలో అభివృద్ధి చెందింది వైసీపీ నాయకులే'



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

పులివెందుల రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలో పులివెందులలో అభివృద్ధి చెందింది వైసీపీ నాయకులే అని బీజేపీ పులివెందుల పట్టణ అధ్యక్షుడు నవీన్, బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి వాజ్‌పేయినాయుడు ధ్వజమెత్తారు. ఆదివారం పులివెందులలో వారు విలేకరులతో మాట్లాడుతూ గత వైసీపీ హయాంలో పులివెందుల సుందరీకరణ పేరుతో చేసిన పనినే మళ్లీ మళ్లీ చేసి కోట్ల రూపాయలు దండుకున్నారన్నారు. పులివెందులలో చేపట్టే కాంట్రాక్టు పనులను వారి కార్యకర్తలకు అప్పజెప్పి వారి నుంచి కమీషన్లు తీసుకున్న నీచసంస్కృతి వైసీపీ నాయకులకే చెందిందన్నారు. పులివెందులలో పేద ప్రజలకు ఐదేళ్లలో ఒక్క ఇళ్లు కట్టలేక పోయారని, దీనిపై ప్రశ్నిస్తే ప్రతిపక్షపార్టీ వాళ్లు అడ్డుకోవడంతో పూర్తిచేయలేకపోయామని చెప్పడం విడ్డూరమన్నారు. హౌసింగ్ లేఅవుట్ లో చేపట్టిన డ్రైనేజీ, సీసీరోడ్లు తదితర పనులు ఇష్టానుసారం చేశారన్నారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శశిభూషణ్‌రెడ్డిని విమర్శించే స్థాయి వైసీపీ నాయకులకు లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు, లింగాల మండల బీజేపీ యువనాయకుడు విష్ణుయాదవ్ పాల్గొన్నారు.

పూర్వపు విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



చక్రాయపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఒకటి కాదు రెండు దాదాపు 40ఏళ్ల క్రితం వారంతా ఒకే పాఠశాల ఒకటే తరగతి విద్యార్థులు. ఎక్కడెక్కడో స్థిరపడిపోయిన వారందరూ ఒక్కటి అయ్యారు. వారే చక్రాయపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివారు. 1985-86 విద్యా సంవత్సరంలో పదో తరగతి వారందరూ ఇపుడు కలిసి తమ మధురానుభూతులు స్మరించుకున్నారు. ఈ అపూర్వ ఘట్టం ఆదివారం చక్రాయపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పూర్వపు విద్యార్థులు తమ గురువులనుసన్మానించారు. ప్రధానంగా అప్పటి తెలుగు ఉపాధ్యాయుడు బాలనారాయణను ఘనంగా శాలువపూలమాలలతో సత్కరించి పాదాభివందనం చేసుకున్నారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు నాగేంద్రను సన్మానం చేసి పాఠశాలకు గుర్తింపుగా రూ.10వేలు ఆర్థిక సహాయం చేశారు.

వేడుకగా సత్యసాయిబాబా గ్రామోత్సవం

వేంపల్లె, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శతవర్ష వేడుకల్లో భాగంగా వేంపల్లెలో సత్యసాయిబాబా చిత్రపటంతో గ్రామోత్సవం నిర్వహించారు. సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో బ్యాండ్ మేళాలతో ఈ గ్రామోత్సవం సాగింది. ఉదయం స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈనెల 21 నుంచి పూజా కార్యక్రమాలు నిర్వహించి చివరి రోజు గ్రామోత్సవం, అన్నదాన కార్యక్రమం, పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి కమిటీ కన్వీనర్ సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.



సత్యసాయిబాబా గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు

సత్యసాయి సేవలు నిరుపమానం



బ్రహ్మంగారిమఠంలో సత్యసాయిబాబాకు పూజలు నిర్వహిస్తున్న పీఠాధిపతి విరజానందస్వామి



పోరుమామిళ్లలో సత్యసాయిబాబా రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి సత్యసాయిబాబా ప్రజలకు అందించిన సేవలు నిరుపమానమని ఉపాధ్యాయ సంఘాల సమన్వయవేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఉపాధ్యాయ సేవా కేంద్రంలో సత్యసాయిబాబా శతజయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అనంతపురం, తెలంగాణాలోని అనేక గ్రామాల్లో ప్రజలకు తాగునీరు అందించిన ఘనత అయనకు దక్కుతుందన్నారు. పేదల కోసం ఉచిత వైద్యం విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి కృషి చేశారన్నారు. ఆయన ఆధ్యాత్మిక బోధనలు ఎంతో మందికి మార్గనిర్దేశం చేశాయన్నారు. కోట ఓబుళరెడ్డి, కేరోజీరావు, బాబు, కిరణ్, బాలమునిరెడ్డి, రిజ్వాన్ పాల్గొన్నారు.

సత్యసాయి బాబా అందరికీ స్ఫూర్తి

ప్రొద్దుటూరు , నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : భగవాన్ పుట్టపర్తి సత్యసాయి బాబా అందరికీ స్ఫూర్తి అని తహసీల్దారు గంగయ్య పేర్కొన్నారు. ఆదివారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో భగవాన్ సత్యసాయి బాబా శత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయనసేవా స్ఫూర్తిని అందిపుచ్చుకోవాలన్నారు.

ఘనంగా బాబా శతవర్ష జయంతి

పోరుమామిళ్ల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పోరుమామిళ్లలో సత్యసాయిబాబా శత వర్ష జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదివారం అమ్మవారిశాలవీధిలో సత్యసాయిబాబా మందిరంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నగర సంకీర్తన నిర్వహించారు. ఈకార్యక్రమానికి బద్వేలు టీడీపీ యువనేత రితీష్‌కుమార్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు.కార్యక్రమంలో పోరుమామిళ్ల సర్పంచ్ యనమల సుధాకరర్, రోడ్లు, రవాణాశాఖ డైరెక్టరు సాదనకారి రంతు, టీడీపీ నాయకులు కొండా రామక్రిష్ణరెడ్డి, మార్కెట్‌యార్డు వైస్‌చైర్మన్ రవీంద్రరెడ్డి, సహకార సంఘం అధ్యక్షుడు కల్లూరి వెంకటక్రిష్ణారెడ్డి, ఇమాంహుసేన్, శెట్టెం ప్రతాప్, సీతా వెంకటసుబ్బయ్య, సత్యనారాయణ, అతికారి రాజా తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం స్వామివారి రథయాత్ర పురవీధుల్లో భక్త జన సందోహం నడుమ జరిగింది.

బ్రహ్మంగారిమఠంలో: బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలో ఆదివారం సత్యసాయిబాబా శత జయంతి వేడుకలు ఆపోలు శివారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా అచలానంద ఆశ్రమం పీఠాధిపతి విరజానందస్వామి, మండల అభివృద్ధి ధికారి రాంమచంద్రారెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా పీఠాధిపతి విరజానందస్వామి మాట్లాడుతూ మానవాళికి సేవ చేయడమే భగవంతుని సేవ అనే నమ్మకాన్ని సత్యసాయిబాబా ప్రచారం చేశారన్నారు. అనంతరం పోలు శివారెడ్డి పీఠాధిపతికి ఎంపీడీవోకు శాలువా, పూలదండలతో ఘనంగా సన్మానించారు. అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

బద్వేలులో : ప్రేమ, సేవా జీవితం అంటూ బోధించిన తాత్వికుడు పుట్టపర్తి సత్యసాయి బాబా అని మున్సిపల్ కమిషనరు నరసింహారెడ్డి, బద్వేలు, గోపవరం తహసీల్దార్లు ఉదయ భాస్కర్‌రాజు, త్రిభువనరెడ్డిలు అన్నారు. ఆదివారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో పుట్టపర్తి సత్యసాయిబాబా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ రూరల్ సీఐలు లింగప్ప, క్రిష్ణయ్య, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ మల్లేశ్, ఎక్సైజ్ సీఐ సీతారామిరెడ్డి, ఆర్టీసీ డీఎం నిరంజన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దువ్వూరులో: దువ్వూరు మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం భగవాన్ సత్యసాయి శతజయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి సత్యసాయి సేవలను, కొనియాడారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ హిదయతుల్లా, ఎంపీడీవో సుబ్బారెడ్డి, తహసీల్దారు సంజీవరెడ్డి, వీఆర్వోలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు వజ్రాయుధం శక్తి యాప్ : డీఎస్పీ



శక్తి యాప్ పోస్టరును ప్రదర్శిస్తున్న పోలీసులు

మైదుకూరు నవంబరు23 (ఆంధ్రజ్యోతి): మహిళలకు శక్తి యాప్ వజ్రా యుధంలాంటిదని మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. వార్షిక తనిఖీలలో భాగంగా మైదుకూరు అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం డీఎస్పీ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అత్యవసర పరిస్థితులలో మహిళలకు ఆయుధం అయిన శక్తి యాప్ పోస్టర్లను పోలీసులచే ఆయన ఆవిష్కరించారు. ఈ రందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల భద్రత కోసమే శక్తి యాప్‌ను రూపొందించారని, ప్రతి మహిళ ఈ యాప్‌ను ఫోన్లో డౌన్లోడ్ చేసుకొంటే కంట్రోల్ రూమ్‌కు కనెక్ట్ అవుతుంద న్నారు. ప్రమాదంలో కాని, అత్యవసర సమయంలో కాని ఐదుసార్లు షేక్ చేస్తే కంట్రోల్ రూమ్‌కు అలర్ట్ వస్తుందని_5నిమిషాలలో పోలీసుల సహాయం అందుతుందన్నారు.దీని ద్వారా ఫిర్యాదులు కూడా చేయవచ్చు అన్నారు. స్థానిక ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా జాగ్రత్తగా విధులను నిర్వర్తించాలని పోలీసులను హెచ్చరించారు. ప్రతిరోజు కేటాయించిన ప్రాంతాలలో పర్యటించాలన్నారు. ప్రజలకు శాంతిభద్రతలను కల్పించడంలో శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం కార్యాలయ రికార్డులను పరిశీలించారు.

పీఎస్ఐఓసీకి సహకరించిన దాతలకు సన్మానం

ఇటీవల మైదుకూరులో డీఐజి కోయ ప్రవీణ్ చేతులమీదుగా ప్రారంభించిన పబ్లిక్ సేఫ్టీ ఇంటిగ్రేటెడ్ ఆపరేషన్ సెంటర్(పీఎస్ఐఓసీ) కు సహకరించిన దాతలను డీఎస్పీ రాజేంద్రప్రసాద్ ఘనంగా సన్మానించారు. నిఘానేత్రాల ఏర్పాటులో శ్రద్ధ చూపిన ఎస్సై చిరంజీవిని ప్రత్యేకంగా పన్మానించారు.ఈ కార్యక్రమంలో అర్బన్ సీఐ రమణారెడ్డి, ఎస్సై సుబ్బారావులతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ముక్తియార్‌కు అభినందనల వెల్లువ

● పలు సంస్థల ప్రతినిధుల సన్మానం



ముక్తియార్‌ను సన్మానిస్తున్న ఆర్యవైశ్య ప్రముఖులు

ప్రొద్దుటూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఏపీ స్టేట్ షేక్ వెల్ఫేర్ అండ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా పదవి లభించడంపై వీఎస్ ముక్తియార్‌కు పట్టణంలోని పలు సంస్థలు సంఘాల ప్రముఖులు పెద్ద ఎత్తున అభినందనలు తెలియజేస్తున్నారు. ఆదివారం ఆర్య వైశ్య ప్రముఖులు మాజీ మున్సిపల్ చైర్మన్ కామిశెట్టి కుమారులు కామిశెట్టి క్రిష్ణమూర్తి, కూరగాయమార్కెట్ అసోషియేషన్, స్వర్ణకారుల సంఘం, చేనేత సంఘం, టైర్స్ వ్యాపారుల అసోషియేషన్, బలిజ సంఘం నేతలు, నందమూరి అభిమానులు, కౌన్సిల్లర్లు మాజీ కౌన్సిల్లర్లు పెద్ద ఎత్తున సన్మానాలు చేశారు. టీడీపీ కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున ముక్తియార్ ఇంటికి వచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. కేక్‌లు కట్ చేసి స్వీట్స్ పంచిపెట్టారు. ముక్తియార్ పార్టీకోసం కష్టపడి పనిచేశారని సీఎం చంద్రబాబు మంత్రి లోకేశ్‌లు ఆయనకు తగిన గుర్తింపు ఇవ్వడంపై సంతోషం వ్యక్తంచేశారు.

ప్రొద్దుటూరు టౌన్‌లో: ఏపీ స్టేట్ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సొసైటీ చైర్మన్‌గా నియమితులైన వీఎస్‌ముక్తియార్‌ను నందమూరి యువ సేవాసమితి నాయకులు ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నందమూరి యువసేవా సమితి అధ్యక్షుడు గోమేదికం సుదర్శన్, ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బయ్యలు మాట్లాడుతూ ముక్తియార్ ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉండి పార్టీ అభివృద్ధికోసం కృషి చేశారన్నారు. కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ గురప్పయాదవ్, టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి టప్పా మహబూబ్‌బాష, తెలుగుయువత జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి రామానాయుడు, రహమతుల్లా, బాష తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ పిల్లల పురోభివృద్ధికి తోడ్పడాలి



మెడికల్ క్యాంపులో మాట్లాడుతున్న సహిత విద్య సమన్వయకర్త రమణమూర్తి

ప్రొద్దుటూరు రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు తల్లిదండ్రులతోపాటు సమాజంలోని ప్రతి ఒక్కరు వారి పురోగతికి తోడ్పడాలని ఉమ్మడిజిల్లా సహిత విద్య సమన్వయకర్త రమణమూర్తి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న భవిత కేంద్రంలో సమగ్ర శిక్ష విద్యాశాఖ ఆధ్వర్యంలో మెడికల్ అసెస్‌మెంట్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక అవసరాల పిల్లల పట్ల తల్లిదండ్రులు ప్రేమాభిమానాలతో కలిగి ఉండి వారి సేవ చేసే భాగ్యం ప్రతి ఒక్కరికి దక్కదనే ధోరణిలో చేయూతనివ్వాలన్నారు. ఈ క్యాంపులో ఆడియోలోజిస్ట్ మమత పరీక్షలు నిర్వహించారు. అలిమ్‌కోటీం, ఆడియోలోజిస్ట్ టీం వివిధ వైద్య పరీక్షలను నిర్వహించగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, భవిత కేంద్ర ఐఈఆర్‌పీ సంగీత పాల్గొన్నారు

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించండి



మొక్కలు నాటుతున్న విద్యార్థినీ, విద్యార్థులు


బద్వేలుటౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఎస్‌బీవీఆర్ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ వెంకటసుబ్బారెడ్డి, ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారి ఈశ్వర్యలు పేర్కొన్నారు. ఆదివారం పెద్దిరాజుపల్లెలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహనాలతోపాటు పరిసరములు, వివిధ ప్రక్రియల వలన వాతావరణంలో కాలుష్యం ఏర్పడుతుందని, కాలుష్యం నుంచి రక్షించుకొనుటకు చెట్లను వృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు.

రైతన్నా.. మీకోసం కార్యక్రమంపై అధికారుల సమీక్ష

రాజుపాలెం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రైతన్న మీ కోసం.. కార్యక్రమానికి సంబంధించి రాజుపాలెం ఎంపీడీవో సభాభవనలో ఆదివారం మండల ప్రత్యేకాధికారి డీవీ రంగరాజు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 24 నుంచి 29 వరకు నిర్వహిస్తున్న రైతన్న మీ కోసం కార్యక్ర మంపై గ్రామస్థాయి అధికారులకు సూచనలు ఇచ్చారు. 500 మంది రైతులకు ఒక టీం ఏర్పాటు చేసి మండలంలో 25 టీంలు ఏర్పాటు చేశామన్నారు. ఒక్కో రోజు 30 కుటుంబాలు, 90 మంది రైతులతో కలిసి ప్రభుత్వం రూపొందించిన యాప్‌లో సర్వే వివరాలు పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, రైతు ఖాతాలోలో జమ అయ్యాయా లేదా, రైతులు విత్తనాలు ఎరువులు సక్రమంగా దొరుకుతున్నాయా లేదా తదితర వాటిని పొందుపరుస్తామన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఎంపీడీవో షాకిర్‌ఆలీఖాన్, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొండాపురంలో: మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో సోమవారం నుంచి శనివారం వరకు రైతన్న-మీకోసం కార్యక్రమం చేపడుతున్నట్లు ఏవో ఏవీరామాంజులరెడ్డి తెలిపారు. రైతులు సచివాలయ సిబ్బంది ద్వారా ఏపీఏఐఎంఎస్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకొని తమ వివరాలను తెలపాలన్నారు. ఈ యాప్ ద్వారా రైతులు ఈ-క్రాప్, ఇన్సూరెన్సూ, వాతావరణం, పంట మద్దతు ధర, సూచనలు తదితర సమగ్ర సమాచారాన్ని తెలుసుకోవచ్చన్నారు.

రోడ్డు విస్తరణ పనులతో ప్రజల హర్షం



రోడ్డు విస్తరణ పనులు చేపట్టిన దృశ్యం

జమ్మలమడుగు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని ప్రొద్దుటూరు రోడ్డులో టౌన్ చర్చి ఎదురుగా ఆదివారం రాత్రి రోడ్డు వెడల్పు కార్యక్రమం చేపట్టారు. గత కొన్ని సంవత్సరాలుగా ట్రాఫిక్‌తో ప్రజలు, వాహనదారులు ఇబ్బందిపడేవారు. ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి సహకారంతో కూటమి నాయకులు ఎక్స్‌కవేటర్ల ద్వారా ఒక్కసారిగా రోడ్డు వెడల్పు కార్యక్రమం చేపట్టారు. ఎవరు ఇబ్బంది కలిగించకుండా అర్బన్ పోలీసు స్టేషన్ ఎస్ఐలు హైమావతి, రామకృష్ణ, సుమారు పది మందికిపైగా పోలీసుల పర్యవేక్షణలో రోడ్డు విస్తరణ కార్యక్రమాన్ని చేపట్టారు. రోడ్డు విస్తరణ పనులతో స్థానిక ప్రజలు ట్రాఫిక్ సమస్య లేకుండాపోయిందని హర్షం వ్యక్తం చేశారు.

బీఎస్పీ అధ్యక్షుడిగా బ్రహ్మయ్య

పోరుమామిళ్ల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : బద్వేలు నియోజకవర్గం బీఎస్పీ అధ్యక్షునిగా చందులూరి బ్రహ్మయ్యను ఎన్నుకున్నారు. ఆదివారం పోరుమామిళ్లలో జరిగిన సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సగిలి గురప్ప, ప్రధాన కార్యదర్శి బీబీ, యోసోబు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి శోభాయాత్ర



మైదుకూరు రూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి) : మైదుకూరు మున్సి పాలిటీ పరిధిలోని అయ్యప్పస్వామి భక్తులు ఆయ్యప్పస్వామి శోభ యాత్రను పట్టణంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. స్థానిక నంద్యాల రోడ్డులోని అయ్యప్పస్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు జరి గాయి. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం జరిగింది. సాయంత్రం పట్టణంలో పెద్దఎత్తున మహిళలు దీపాలు చేతపట్టి స్వామియే,శరణం అయ్యప్ప అం టూ దారి వెంబడి కీర్తనలతో గ్రామోత్సవం శోభయామనంగా జరి గింది.

పురాతన గుడిని పునర్నిర్మించండి

జమ్మలమడుగు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలంలోని పి.సుగుమంచిపల్లె గ్రామంలో శిథిలావస్థకు చేరిన పురాతన ఆంజనేయస్వామి గుడిని పునర్నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. సుమారు 150 సంవత్సరాల క్రితం గుడి నిర్మించినట్లుగా పెద్దలు చెబుతున్నారు. దీంతో అప్పట్లో నిర్మించిన ఆంజనేయస్వామి గుడి శిథిలావస్థకు చేరిందని అందులో పూజలు అందుకుంటున్న ఆంజనేయస్వామి విగ్రహం ఆ గది నుంచి పక్కన ఏర్పాటు చేసినట్లు స్థానికులు తెలిపారు. గ్రామంలో భక్తులు ఆలయాన్ని దర్శించుకుని పూజలు చేసుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు. ప్రజాప్రతినిధులు స్పందించి ఆంజనేయస్వామి పురాతన ఆలయాన్ని పునర్నిర్మాణం చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

బీజేపీ రూరల్ అధ్యక్షుడిగా మురళీకృష్ణారెడ్డి



నియామక పత్రం అందుకుంటున్న మురళీకృష్ణ

ప్రొద్దుటూరు రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ప్రొద్దుటూరు మండల అధ్యక్షునిగా గోపిరెడ్డి మురళీకృష్ణారెడ్డి ఎన్నికయ్యారు. ఆదివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు జంగిటి వెంకటసుబ్బారెడ్డి ఆదేశాల మేరకు ప్రొద్దుటూరు రూరల్ అధ్యక్షునిగా గోపిరెడ్డి మురళకృష్ణారెడ్డిని, కమిటీ సభ్యులను ఎన్నుకున్నట్లు జిల్లా జనరల్ సెక్రటరి కోనేటి కృష్ణప్రదీప్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయనకు నియామక పత్రం అందజేశారు. గత 20 సంవత్సరాలుగా బీజేపీ పార్టీకి అందించిన సేవలను గుర్తించి తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన జిల్లా అధ్యక్షునికి కృతజ్ఞతలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కోకన్వీనర్ గౌరీశంకర్, పట్టణాధ్యక్షులు నరేంద్ర, పాలెం కిరణ్‌కుమార్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ గురుప్రసాద్, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్జీవో నేతలు ఉద్యోగుల హక్కుల కోసం పోరాడాలి

● నూతన కార్యవర్గాన్ని సన్మానించిన పెన్షనర్స్‌అసోసియేషన్



ఎన్జీవో నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న పెన్షనర్స్ అసోసియేషన్ నేతలు

ప్రొద్దుటూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎన్జీవో నేతలు ఉద్యోగుల హక్కుల కోసం రాజీ లేని పోరాటం చేయాలని పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రిటైర్డ్ లెక్చరర్ దస్తగిరి రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పెన్షనర్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఎన్జీవో నూతన అధ్యక్షుడు రామసుబ్బయ్య కార్యదర్శి ప్రమీలాదేవి కోశాధికారి సదాశివ కార్యవర్గ సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా దస్తగిరి రెడ్డి మాట్లాడుతూ తండ్రి స్థానంలో పెన్షనర్స్ అసోషియేషన్ వుంటే కొడుకు స్థానంలో ఏపీఎన్జీవో అసోషియేషన్ ఉండి కలిసి మెలిసి హక్కుల కోసం పోరాడాలన్నారు. ఎన్జీవో అసోసియేషన్ ప్రొద్దుటూరు తాలూకా యూనిట్ నూతన కార్యవర్గంను పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పెన్షనర్స్ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి వస్తే తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షుడు జె.రామసుబ్బయ్యయాదవ్, కార్యదర్శి ఇ.ప్రమీళ, కోశాధికారి పి.సదాశివయాదవ్, ఇతర కార్యవర్గ సభ్యులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దస్తగిరిరెడ్డి, కార్యదర్శి వెంకటయ్య, కోశాధికారి లక్ష్మణ్ణ, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

చెర్లోపల్లె రైతులకు నష్టపరిహారం అందించాలి

పోరుమామిళ్ల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెర్లోపల్లె చెరువు కింద నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని రైతు సంఘం వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు ఆయేరకు ఆయా సంఘాల నేతల ఆధ్వర్యంలో కరపత్రాలు ఆవిష్కరించారు. ఆదివారం టేకూరుపేటలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లాకార్యదర్శి అన్వేష్, రైతు సంఘం నాయకులు భైరవ ప్రసాద్ మాట్లాడుతూ నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని ఈ నెల 30న టేకూరుపేటలో జరిగే రైతు సదస్సును జయప్రదం చేయాలని కోరారు.

మాజీ మంత్రి డీఎల్‌ను కలిసిన తులసిరెడ్డి



మాజీ మంత్రి డీఎల్ రవీంద్రారెడ్డిని కలిసిన తులసిరెడ్డి

మైదుకూరు రూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి) :మాజీ మంత్రి డీఎల్ రవీంద్రారెడ్డిని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నరెడ్డి తులసిరెడ్డి ఆదివారం ఖాజీపేటలోని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి సంజీవని లాంటి ప్రత్యేక హోదా ఇవ్వకుండా రాష్ట్రానికి బీజేపీ మోసం చేస్తోందని దుయ్యపట్టారు. రాష్ట్రానికి టీడీపీ, వైసీపీ రాహు, కేతువులగా దాపురించారన్నారు. నాగేశ్వరకోన వద్ద ఓ కార్యక్రమానికి తులసిరెడ్డి హాజరై డీఎల్ నివాసానికి వచ్చి ఆయనను శాలువతో సత్కరించారు సమావేశంలో .ఆయన వెంట ఖాజీపేట కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ ఫయాజ్, జీవి రమణ, ఇస్మాయిల్, ఖలీల్, జిలాని తదితరులు ఉన్నారు.

సబల్ ప్రాజెక్టు పనులు పరిశీలించిన అధికారులు



పొలంలో రైతులతో మాట్లాడుతున్న రాష్ట్ర అధికారులు

బ్రహ్మంగారిమఠం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేకలకుంట్ల పంచాయతీలోని పలు గ్రామాల్లో సీఎస్ఏ సంస్థ సబల్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో జరుగుతున్న ల్యాండ్ స్కేప్ పనులను ఆదివారం రెయిన్ ఫారెస్టు అలియన్స్ స్టేట్‌ప్రాజెక్టు మేనేజరు కిరణ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర లీడ్ వినూత్న తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు వాంపల్లె చెరువు గ్రామంలో సబల్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో రైతులకు చేపట్టిన అంశాల గురించి తెలుసుకున్నారు. అలాగే సబల్ ప్రాజెక్టు ద్వారా కలిగిన ఉపయోగాలు, లాభాలను తెలుసుకున్నారు. గ్రామాలప్రధాన సమస్యలు జీవనోపాధులు రైతులను అడిగి తెలుసుకున్నారు. ఎఫ్ఈఎస్ కౌశల్, జ్యోతిబాబు ఎంఎస్ఎల్‌బీ ఫార్మేషన్ గురించి రైతులతో మాట్లాడారు. గ్రామంలో ఎలాంటి సమస్యలు వచ్చినా కూడా తమకు పరిష్కరించే విధంగా ముందుంటామన్నారు. అలాగే ఉమ్మడి భూములు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రణాళికల గురించి తెలిపారు. అనంతరం ప్రోగ్రాం కోఆర్డినేటరు శ్రావణి, క్లస్టరు కోఆర్డినేటరు మహేశ్‌లు మాట్లాడుతూ గత మూడేళ్లగా సబల్ ప్రాజెక్టు ద్వారా రైతులు సాధించిన ప్రగతి గురించి ప్లానింగ్ కార్యక్రమాలపై చర్చించారు. అలాగే సబల్ ప్రాజెక్టు రైతులకు మోడల్స్ ఎంటర్ ప్రైజెస్, ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు కేంద్రంను గురించి అధికారులకు వివరించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ కషాయాల షాపును సందర్శించారు. ఈ కార్యక్రమంలో వీవోఏలు శాంతయ్య, రవి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది దేవిరాణి, పౌర్ణవి, రైతులు, ప్రజలు పాల్గొన్నారు,